ఈనాడు ఒడిశా

సోమవారం అక్టోబరు 21, 2024 5


యంత్రాంగాన్ని సన్నద్ధం చేశాం

★ మంత్రి సురేష్



భువనేశ్వర్, న్యూస్‌టుడే: తుపాను ముప్పును ఎదుర్కోవడానికి ప్రభుత్వం సన్నద్ధంగా ఉందని, యంత్రాంగాన్ని అప్రమత్తం చేశామని రెవెన్యూ, విపత్తుల నివారణ శాఖల మంత్రి సురేష్ పూజారి ఆదివారం సాయంత్రం భువనేశ్వర్‌లో విలేకర్లకు చెప్పారు. ఈ విపత్తు ఒడిశా వద్ద తీరం దాటే సూచనలున్నాయని ఐఎండీ, ఇతర విదేశీ మెట్ సంస్థలు అంచనా వేసినందున ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపడుతోందన్నారు. ప్రత్యేక రిలీఫ్ కమిషనర్ (ఎస్ఆర్సీ) దేవ్‌రంజన్ కుమార్ సింగ్ కోస్తా, తీర జిల్లాల పాలనాధికారులతో మాట్లాడి అప్రమత్తం చేశారన్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) మనోజ్ అహుజా అత్యవసర శాఖల ప్రిన్సిపల్ కార్యదర్శులకు సూచించారు. సోమవారం మధ్యాహ్నం లోక్ సేవాభవన్‌లో కీలక సమావేశం ఏర్పాటు చేస్తున్నామని, తుపాను పరిస్థితిపై సమీక్షించి మరిన్ని నిర్ణయాలు తీసుకుంటామన్నారు. ప్రాణనష్టం నివారణ ప్రభుత్వ ధ్యేయమని, భారీ వర్షాల వల్ల నదులకు వరదలొస్తే ఎదుర్కోవడానికి ఓడ్రాఫ్, అగ్నిమాపక జవానులను సిద్ధం చేస్తున్నామని, సిబ్బంది సెలవులు తీసుకోరాదని తెలియజసినట్లు మంత్రి తెలిపారు.

24న తీరం దాటనున్న తుపాను




★ నేడు అల్పపీడనం, రేపు వాయుగుండం

★ రాష్ట్రానికి భారీ వర్ష సూచన

★ గాలుల వేగం 100 నుంచి 120 కి.మీ. ఉండొచ్చు

గోపాలపూర్, న్యూస్‌టుడే: ఉత్తర అండమాన్ సముద్రంలో ఏర్పడిన ఆవర్తనం సోమవారం ఉదయం అల్పపీడనంగా మారనుంది. 22న వాయుగుండంగా బలం పుంజుకుంటుంది. బుధవారం (23న) ఇది తుపానుగా మారనుందని గోపాల్‌పూర్ వాతావరణ అధ్యయన కేంద్రం (ఐఎండీ) అధికారి ఉమాశంకర్ దాస్ ఆదివారం సాయంత్రం 'న్యూస్‌టుడే'కు చెప్పారు. తుపానుగా మారిన తరువాత ఈ విపత్తు ఉత్తర పశ్చిమ దిశగా ఒడిశాకు చేరువై 24 ఉదయం తీరం దాటనుందన్నారు. ప్రస్తుత అంచనా ప్రకారం బాలేశ్వర్, పశ్చిమబెంగాల్ తీరాన్ని దాటుతుందన్నారు.



అండమాన్ సముద్రంలో ఆదివారం దృశ్యమిది (ఐఎండీ జారీ చేసిన ఉపగ్రహ చిత్రం)

తుపాను పేరు 'దానా'

పొంచి ఉన్న తుపాను పేరు 'దానా'. ఈ పేరు కతార్ దేశం సూచించింది. దీని అర్థం ముత్యం. తుపాను తీరం దాటే సమయంలో గాలి వేగం 100 నుంచి 120 కిలోమీటర్లుగా ఉంటుందని దాస్ ప్రాథమిక అధ్యయనం మేరకు చెప్పారు.

చేపల వేటకు వెళ్లొద్దు

23 నుంచి ఒడిశాలోని తీర ప్రాంతాల్లో గంటకు 60 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని, వర్షాలూ కురుస్తాయని తెలిపారు. సముద్రంలో కెరటాల ఉద్ధృతి తీవ్రంగా ఉంటుందని, సోమవారం నుంచి సముద్రం ఉపరితలంలో గాలుల తీవ్రత ఉంటుందని చెప్పారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని మత్స్యకారులు తదుపరి సూచనలు చేసే వరకు చేపల వేటకు వెళ్లొద్దని హెచ్చరికలు జారీ చేశామన్నారు. విపత్తుల నివారణ శాఖ యంత్రాంగానికి అప్రమత్తం చేశామన్నారు.

27 వరకు వర్షాలు

24, 25 తేదీల్లో ఉత్తర కోస్తా, తీర జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయన్నారు. గంజాం, పూరీ, ఖుర్దా, కేంద్రపడ, జగత్సింగ్‌పూర్, కటక్, జాజ్‌పూర్, భద్రక్, బాలేశ్వర్, నయాగఢ్ జిల్లాల్లో 20 నుంచి 25 సెంటీమీటర్ల చొప్పున భారీ వర్షపాతం నమోదు కావచ్చన్న అంచనా ఉందన్నారు. గజపతి, రాయగడ, కటక్, ఢెంకనాల్, అనుగుల్, మయూర్‌భంజ్, కేంఝర్ జిల్లాల్లోనూ భారీగా కురుస్తాయని, 27 వరకు వర్షాలు కురిసే సూచనలున్నాయన్నారు.

24న శ్రీక్షేత్రానికి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము

గోపాలపూర్, న్యూస్‌టుడే: రాష్ట్రపతి ద్రౌపదీముర్ము 24న పూరీ సందర్శిస్తారు. శ్రీక్షేత్రంలో ఆమె జగన్నాథుని సన్నిధిలో పూజలు చేస్తారు. ఈ నేపథ్యంలో శ్రీక్షేత్ర పాలనాధికారి అరవిందపాఢి శనివారం రాత్రి అధికారులు, సేవాయత్‌లతో సమావేశమై ఏర్పాట్లు పరిశీలించారు. 24న 12 గంటలకు రాష్ట్రపతి ఆలయ ప్రవేశం చేస్తారు. దీనికి గంట ముందుగా భక్తుల దర్శనాలు నిలిపివేయాలని నిర్ణయించారు. స్వామి సన్నిధిలో ఆమె 40 నిమిషాలుంటారు. పూరీ తాలబణియా తాత్కాలిక ఎయిర్‌స్ట్రిప్ నుంచి ఆలయానికి రోడ్డు మార్గంలో రాష్ట్రపతి చేరుకుంటారు. ఈ నేపథ్యంలో గట్టి బందోబస్తు ఏర్పాటు చేయనున్నారు.

కొరత సృష్టించి... ధరలు పెంచితే కఠిన చర్యలు

★ మంత్రి కృష్ణచంద్ర పాత్ర్



భువనేశ్వర్, న్యూస్‌టుడే: తుపాను ముప్పు నేపథ్యంలో నిత్యావసరాలకు కృత్రిమ కొరత సృష్టించి, ధరలు పెంచితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆహార, పౌరసరఫరాల శాఖల మంత్రి కృష్ణచంద్రపాత్ర్ చెప్పారు. ఆదివారం సాయంత్రం భువనేశ్వర్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ రాష్ట్రంలో నిత్యావసర సామగ్రి పుష్కలంగా ఉందని, ఎలాంటి కొరత లేదన్నారు. తుపానును సాకుగా చూపించి వ్యాపారులు ధరలు పెంచినా, కృత్రిమ కొరత సృష్టించినా చర్యలు ఉంటాయని హెచ్చరించారు. దీనిపై ఉన్నతాధికారులతో సమీక్షించామని, మార్కెట్లపై నిఘా ఉంచామన్నారు. పౌరసరఫరా శాఖ అధికారులు నగరాలు, పట్టణాల్లోని మార్కెట్లు సందర్శించి విక్రయాలపై నిఘా ఉంచుతారని మంత్రి చెప్పారు.

ఒడిశాలో పర్యాటక రంగానికి ఉజ్వల భవిత

పూరీ దీపస్తంభం వేడుకల్లో శర్వానంద



పూరీలో వేడుకలు ప్రారంభిస్తున్న కేంద్రమంత్రి శర్వానంద. పక్కన ఉప ముఖ్యమంత్రి ప్రభాతి తదితరులు

గోపాలపూర్, న్యూస్‌టుడే: ఒడిశాలో పర్యాటక రంగానికి మంచి భవిష్యత్తు ఉందని, 'దేఖో అప్నాదేశ్' (చూడండి మనదేశం) కార్యక్రమం కింద సందర్శనీయ స్థలాలకు నూతన సొబగులు కల్పించాలన్నది ప్రధాని నరేంద్ర మోదీ ధ్యేయమని ఓడరేవులు, నౌకా రవాణా శాఖ మంత్రి శర్వానంద సోనోవాల్ చెప్పారు. శనివారం రాత్రి పూరీలోని తాలబణియా వేదికగా పూరీ దీపస్తంభం రెండురోజుల వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న కేంద్రమంత్రి మాట్లాడుతూ... గడిచిన పదేళ్ల కాలంలో ఓడరేవులు, దీపస్తంభాలకు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం సమకూరిందన్నారు. దేశంలోని విశాల తీరసంపద సద్వినియోగం చేయడానికి బీచ్ టూరిజం కింద లైట్‌హౌస్‌లను సందర్శనీయ స్థలాలుగా తీర్చిదిద్దుతున్నామన్నారు. కాసుల పంట పండిస్తున్న పర్యాటక రంగం ఉపాధికి బాటలు వేస్తున్నందున రాష్ట్ర ప్రభుత్వం అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పర్యాటక శాఖకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఉపముఖ్యమంత్రి ప్రభాతి పరిడ మాట్లాడుతూ డబుల్ ఇంజిన్ పాలనలో రాష్ట్రంలోని పర్యాటక కేంద్రాలన్నీ వైభవం సంతరించుకుంటాయన్నారు. ఈ దిశగా ప్రభుత్వం కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఓడరేవులు, నౌకా రవాణా శాఖ కార్యదర్శి టి.ఎల్.రాజేంద్రన్, పరదీప్ పోర్ట్ ట్రస్ట్ అధ్యక్షుడు పి.ఎల్.హరనాథ్, దీపస్తంభాల డైరెక్టర్ జనరల్ ఎన్.మురుగానందన్, ఇతర అధికారులు పాల్గొన్నారు. అనంతరం జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు సందర్శకుల్ని అలరించాయి. సోమవారం జరిగిన ముగింపు కార్యక్రమంలో భాగంగా హోటలీయర్లు, గైడ్‌లు, టూర్స్, ట్రావెల్ ప్రతినిధులతో సదస్సు నిర్వహించారు.



కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, అతిథులు

ఆదాయం అంతంతే..

● కుటుంబాల నెలవారీ ఆదాయంలో అట్టడుగున రాష్ట్రం

● పొదుపు వైపు దృష్టి సారిస్తున్న 73 శాతం కుటుంబాలు

● నాబార్డు తాజా సర్వే నివేదికలో వెల్లడి



పొదుపు వివరాలు నమోదు చేసుకుంటున్న గ్రామీణ మహిళలు

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: రాష్ట్రంలో గ్రామీణ ప్రాంత కుటుంబాల ఆదాయం అంతంతమాత్రంగానే ఉన్నా పొదుపు మంత్రాన్ని పుణికి పుచ్చుకోవడం గమనార్హం. ఒక్కో కుటుంబ సగటు నెలవారీ ఆదాయపరంగా రాష్ట్రం అట్టడుగున కొనసాగుతోంది. ఈ అంశంలో బిహార్ కంటే మన రాష్ట్రం ముందంజలో ఉంది. ఓవైపు ఆదాయం తక్కువగా ఉన్నప్పటికీ 73 శాతం గ్రామీణ కుటుంబాలు పొదుపు వైపు దృష్టి సారిస్తుండడం శుభపరిణామం. నాబార్డు నిర్వహించిన అఖిల భారత గ్రామీణ ఆర్థిక అంతర్భాగ సర్వే తాజా నివేదికలో ఈ అంశాలు వెలుగు చూశాయి. వాటి ప్రకారం రాష్ట్రంలో ఒక్కో కుటుంబం నెలవారీ సగటు ఆదాయం రూ.8,924గా మాత్రమే ఉంది. ఆదాయపరంగా అట్టడుగున ఉన్న రాష్ట్రాల జాబితాలో బిహార్ (రూ.8,878) తరువాత మన రాష్ట్రం రెండో స్థానంలో ఉంది. ఒడిశాలో ఆదాయం తక్కువగా ఉన్నప్పటికీ, 73 శాతం కుటుంబాలు పొదుపు మంత్రం పాటిస్తున్నాయి. వినియోగ వ్యయపరంగానూ వెనుకంజలో ఉన్న మన రాష్ట్రంలో సగటున కుటుంబ ఖర్చు రూ.7,945గా ఉంది. దీనిపై ఒడిశా అర్థశాస్త్ర సంఘం ప్రధాన కార్యదర్శి అమరేంద్రదాస్ స్పందిస్తూ...సూక్ష్మ ఆర్థిక సంస్థలు లభ్యత, ఎస్‌హెచ్‌జీ మహిళల చొరవ వంటి అంశాలు ఎక్కువ కుటుంబాలు పొదుపువైపు దృష్టి సారించేందుకు దోహదపడి ఉండవచ్చని అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో తరచూ తుపాన్లు, వరదలు వంటి విపత్తులు సంభవిస్తున్న నేపథ్యంలో ఆర్థిక భద్రత కోసం ముందుచూపుతో పొదుపు పాటిస్తుండడం మరో కారణం కావచ్చన్నారు. గ్రామీణ కుటుంబాల్లో చాలావరకు వివాహ ఖర్చులు, వైద్యం, ఇతరత్రా ఆకస్మిక అవసరాల దృష్ట్యా ఎక్కువగా పొదుపునకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు దాస్ పేర్కొన్నారు.



గూడు కరవు... బిడ్డ పోషణ బరువు



కె.సింగ్‌పూర్ సమితిలోని ఓ గ్రామంలో కానరాని పక్కా ఇళ్లు

వ్యవసాయ కుటుంబాలదీ అదే పరిస్థితి

ఆదాయపరంగా రాష్ట్రంలో వ్యవసాయ కుటుంబాల పరిస్థితి ఇదే మాదిరిగా ఉన్నట్లు నివేదిక వెల్లడించింది. మన రాష్ట్రంలో వ్యవసాయ కుటుంబం సగటు నెలవారీ ఆదాయం రూ.9,290 కాగా, పంజాబ్‌లో రూ.31,433, హరియాణా రూ.25,655, కేరళలో రూ.22,757గా ఉన్నట్లు నివేదిక బహిర్గతం చేసింది. పొదుపుపరంగా టాప్-10 రాష్ట్రాల జాబితాలో ఒడిశా చోటు సంపాదించుకుంది. ముఖ్యంగా పొదుపు విషయంలో మన రాష్ట్రంలో అతివలు ముఖ్యభూమిక పోషిస్తున్నట్లు పేర్కొంది. రాష్ట్రంలో 88 శాతం గ్రామీణ కుటుంబాల్లో కనీసం ఒక మహిళ ప్రాథమిక పొదుపుదారుగా ఉండగా, ఈ అంశంలో జాతీయ సగటు కేవలం 64 శాతం కావడం గమనార్హం. స్థిర, చరాస్థులకు సంబంధించి పెట్టుబడుల్లోనూ అత్యధిక కుటుంబాలు శ్రద్ధచూపిస్తున్నారని, ఈ కేటగిరిలో టాప్-5 రాష్ట్రాల్లో ఒడిశా ఒకటని నివేదిక స్పష్టం చేసింది. పెట్టుబడుల పరంగా జాతీయ సగటు రూ.47,111 కాగా మన రాష్ట్రంలో ఇది రూ.53,018 కావడం గమనార్హం. రుణగ్రస్తత అంశంలోనూ మొదటి-5 రాష్ట్రాల్లో ఒడిశా ఉండగా, వాణిజ్య బ్యాంకులు, బ్యాంకేతర ఆర్థిక సంస్థలు, బ్యాంకులకు అనుసంధానమైన ఎస్‌హెచ్‌జీలు, బంధువులు, స్నేహితులు నుంచి ఎక్కువ కుటుంబాలు రుణాలు పొందుతున్నట్లు నివేదిక వెల్లడించింది.

ఐఏఎస్ సాధించడమే లక్ష్యం

★ రాష్ట్రానికి సేవ చేస్తా: శ్వేతశ్రీ



భువనేశ్వర్, న్యూస్‌టుడే: భద్రక్ జిల్లా కేంద్రానికి చెందిన శ్వేతశ్రీ మహాపాత్ర తొలి ప్రయత్నంలోనే ఒడిశా సివిల్ సర్వీస్ (ఓఏఎస్) పరీక్షల్లో టాపర్‌గా నిలిచి ఎంతో మందికి ఆదర్శంగా నిలిచింది. ఒడిశా పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఓపీఎస్సీ) 2022 సంవత్సరానికి నిర్వహించిన ఓఏఎస్ పరీక్షల్లో ఆమె టాపర్‌గా నిలిచిన సంగతి తెలిసిందే. దుర్గాపూర్‌లో బీటెక్ (ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్) చదువుకున్న ఆమె రాష్ట్ర పాలనా విభాగం పరీక్షలకు ప్రిపేర్ అయ్యారు. శనివారం రాత్రి ఫలితాలు వెల్లడైన తరువాత శ్వేతశ్రీ విలేకర్లతో మాట్లాడుతూ రోజుకు తాను 7 నుంచి 8 గంటలు చదివినట్లు చెప్పారు. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో టాపర్‌గా నిలిచానని వివరించారు. ఇంతటితో ఆగిపోనని, ఐఏఎస్ సాధించాలన్నది తన లక్ష్యమన్నారు. ఉన్నతాధికారిణిగా రాష్ట్ర ప్రజలకు సేవలు చేయాలన్న ధ్యేయంతో ఉన్నట్లు చెప్పారు.

సివిల్ సర్వీసు పరీక్షలో మెరిసిన గజపతి వాసులు



కుటుంబ సభ్యులతో సింగిపురం హరి

కాశీనగర్, న్యూస్‌టుడే: ఒడిశా సివిల్ సర్వీస్ పరీక్ష ఫలితాల్లో గజపతి జిల్లాకు చెందిన నలుగురు యువకులు మెరిశారు. వీరిలో పర్లాఖెముండిలో ఓంశాంతి కాలనీకి చెందిన దేబబ్రత గౌడ్ 7వ ర్యాంకు సాధించి జిల్లా పేరు నిలిపాడు. గుసాని సమితి బాగుసల గ్రామానికి చెందిన సింగిపురం హరి 421వ ర్యాంకు పొందాడు. ఈయన ప్రస్తుతం కొరాపుట్ జిల్లాలో ఉద్యోగ కల్పనలో విధులు నిర్వహిస్తున్నాడు. హైదరాబాద్‌లో ప్రైవేటు కంపెనీలో పనిచేస్తున్న తల్లిదండ్రులు కుమారుడు సివిల్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించడంపై ఆనందం వ్యక్త చేశారు. జిల్లాలోని మారుమూల ప్రాంతానికి చెందిన ఆర్.ఉదయ్‌గిరి సమితి గెడె గ్రామానికి చెందిన కళింగకుమార్ పూజారి 548 ర్యాంకు సాధించాడు. ఈయన ప్రస్తుతం రాయగడ జిల్లా లోకల్ ఫండ్ ఆడిటర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. జిల్లాలోని గుమ్మ సమితి తుములో గ్రామానికి చెందిన సోమనాథ్ సొబర్ 569వ ర్యాంకు పొందాడు. ఈయన ప్రస్తుతం భువనేశ్వర్‌లోని సచివాలయంలో సెక్షన్ అధికారిగా పనిచేస్తున్నారు. వీరిని బంధువులు, మిత్రులు, చుట్టు పక్కల వారు అభినందిస్తున్నారు.



దేబబ్రత గౌడ్



సోమనాథ్ సొబర్



కళింగకుమార్ పూజారి

పార్టీ అధికారంలో ఉన్నపుడు మంత్రులు, ఎంపీలు సైతం నవీన్‌ను కలవడానికి ఇబ్బందిపడేవారు. ఆయన ఎదుట మాట్లాడేవారు కాదు.. ఆయన చెప్పింది వినడం, ఆచరించడమే తమ విధి అన్నట్లు వ్యవహరించారు. అధికారం పోయింది. ఇంతవరకు అణగదొక్కుకున్న అసంతృప్తి ఇప్పుడు వ్యక్తం చేస్తున్నారు. నవీన్ వ్యవహారశైలిపై విమర్శలు గుప్పిస్తున్నారు. ఈ తరుణంలో అధినేత ఏం చేస్తారన్నది సర్వత్రా ఆసక్తి పెంచుతోంది.

నవీన్ వైపు నేతల చూపు

పార్టీలో తాజా పరిణామాలపై మౌనం వీడని నేత



భువనేశ్వర్, న్యూస్‌టుడే: కళ్లతోనే నేతల్ని శాసించిన బిజద అధినేత నవీన్‌పట్నాయక్ ప్రస్తుత పార్టీ పరిస్థితిపై ఏం ఆలోచిస్తున్నారు. ఇటీవల నాయకులు నోరు పారేసుకుంటున్నారు. విమర్శలు చేస్తున్నారు. నవీన్ మౌనంగానే ఉంటున్నారు. కారణమేంటి? అధినేత ఏం చర్యలు తీసుకోబోతున్నారన్నది కార్యకర్తలు, నేతల్లో కనిపిస్తున్న ప్రశ్నలు.

విధేయులెవరు?

బిజద ప్రాంతీయ పార్టీ ఆవిర్భావం వెనక ఎంతోమంది ప్రముఖులున్నారు. నవీన్ తండ్రి బిజుపట్నాయక్‌కు విధేయులుగా ఉన్నవారు బిజు మరణానంతరం ప్రాంతీయ పార్టీ ఏర్పాటుకు కృషి చేశారు. నవీన్‌ను బలవంతంగా పార్టీ అధ్యక్షునిగా చేశారు. అనంతరం కొందరు ఎదురు తిరిగారు. వారిని అధినేత పార్టీ నుంచి బయటకు పంపారు. మరికొందరు స్వచ్ఛందంగా తప్పుకోగా, కొంతమంది మృతిచెందారు. పార్టీ ఆవిర్భావంలో కీలకపాత్ర పోషించిన వారెవరూ ప్రస్తుతం లేరు. మధ్యలో వచ్చినవారు అధికారం కోసం అధినేతకు ఎదురు తిరగకుండా ఉన్నారు. బిజద అధికారం కోల్పోయిన తరువాత నచ్చిన పార్టీల్లో చేరిపోయారు. మరికొందరు అదేబాటన వెళ్లడానికి సిద్ధమై పార్టీపైన, నేతపైన విమర్శలు చేస్తున్నారు. నిన్నటి వరకు నవీన్ ముందు నిలబడేందుకు సాహసించని వారంతా ఆయన పొరపాట్లు చేసినందు వల్లే పార్టీ పరాజయం పాలైందని విమర్శలు చేస్తున్నారు. దీంతో ప్రస్తుతం అధినేతకు విధేయులెవరన్న దానిపై జోరుగా చర్చ జరుగుతోంది.

ఇదివరకు ఆయనే సర్వస్వమన్నారు

ఇదివరకు నవీన్ సర్వస్వమని ప్రసార సాధనాల ముందు తరచూ ప్రస్తుతించిన నేతల్లో ఐక్యత కొరవడింది. అన్నిచోట్లా అసంతృప్తి ప్రబలంగా ఉంది. దీనివల్ల సభ్యత్వ నమోదు కార్యక్రమం సక్రమంగా సాగడం లేదని తెలిసింది. ఇటీవల జరిగిన తొలివిడత జన సంపర్క యాత్రలు ప్రభావవంతంగా లేవు. ఈ నెల 22 నుంచి రెండో విడత నిర్వహించే యాత్రల పరిస్థితి ఎలా ఉంటుందన్న దానిపై స్పష్టత లేదు. బిజద పరాజయంపై సమీక్షా సమావేశం జరగలేదు. భవిష్యత్తు ప్రణాళిక ఖరారు చేయని నవీన్ నవంబరు నుంచి జిల్లాల పర్యటనకు శ్రీకారం చుడతారని చెబుతున్నారు. అన్నిచోట్లా నేతల మధ్య భేదాభిప్రాయాలు కనిపిస్తున్నాయి. పరస్పర విమర్శలు చేసుకుంటున్నారు. ఇది గమనించిన అధినేత కొంతమందిని పిలిపించి మాట్లాడారు. వచ్చిన వారిలో కొందరు అసంతృప్తి వెళ్లగక్కారు. ఈ నేపథ్యంలో సర్దిచెప్పి పంపేసిన నవీన్ సంస్థాగత ఎన్నికల దిశగా దృష్టి సారించలేదు. కొన్నేళ్లుగా ఈ ప్రక్రియ నిలిచిపోయింది.

తరువాత ఎవరు?

బిజద దీపం రెపరెపలాడుతోందని, ఆ పార్టీకి నాయకత్వం లోపించిందని భాజపా పెద్దలు నిత్యం ప్రసార సాధనాల ముందు చెబుతున్నారు. బిజద నేతలు కొందరు భాజపాలో చేరగా, మరికొందరు చేరనున్నారని చెబుతున్నారు. దీన్ని బిజద సీనియర్ నేతలెవరూ ఖండించకుండా మౌనంగా ఉంటున్నందున అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వయోభారం వల్ల నవీన్‌లో మునుపటి ఉత్సాహం లేదు. తన తరువాత పార్టీకి పెద్దదిక్కు ఎవరన్న దానిపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. దీనిపై ఎవరి వద్దా సమాధానం లేదు. బిజద భవిష్యత్తు అయోమయంలో పడిందని పరిశీలకులంటున్నారు.

మడ అడవులతో తీర రక్షణ

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: ప్రకృతి వైపరీత్యాల ప్రభావిత జిల్లాల్లో ఒకటైన గంజాం జిల్లాలో తరచూ తుపానులు, వరదల వల్ల నష్టాలు వాటిల్లుతున్నాయి. అలల కోతకు జిల్లాలోని పోడమ్మపేట, రామయ్యపట్న, అర్జిపల్లి తీర గ్రామాలు సాగర జలాల్లో మెల్లమెల్లగా కలిసిపోతున్నాయి. దీంతో ప్రకృతి వైపరీత్యాల నుంచి తీర రక్షణకు బ్రహ్మపుర అటవీ డివిజన్ ఆధ్వర్యంలో ప్రయోగాత్మకంగా మడ (మేంగ్రో) అడవుల పెంపకానికి శ్రీకారం చుట్టింది. కళ్లికోట అటవీ రేంజ్ పరిధిలోని రుషికుల్యా నది ముఖద్వారం సమీపాన పురుణాబొంధొ వద్ద ఆరు హెక్టార్లలో వీటి పెంపకానికి ఇటీవల చర్యలు చేపట్టారు. అటవీ శాఖ, యునైటెడ్ నేషన్స్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం, ఎక్రిక్ (ఎన్‌హాన్సింగ్ క్లైమేట్ రెసిలెన్స్ ఆఫ్ ఇండియాస్ కోస్టల్ కమ్యూనిటీ)లు సంయుక్తంగా ఇందుకు ఉద్యమిస్తున్నాయని అటవీ శాఖ అధికారులు విలేకరులకు చెప్పారు. పురుణాబొంధొ వద్ద 'ఫిష్ బోన్' (చేప ముల్లు) పద్ధతిలో ఐదు రకాల జాతులకు చెందిన 15 వేల మడ మొక్కలు నాటామని, వాటి సంరక్షణకు సిబ్బందిని నియమించామని వారు పేర్కొన్నారు. ఇది మంచి ఫలితాలిస్తే తదుపరి జిల్లాలోని ఇతర తీర ప్రాంతాలకు మడ అడవుల్ని విస్తరిస్తామని వారు పేర్కొన్నారు.



పూరీ జిల్లా దేవీ నది ఇరువైపులా మడ అడవులు

పిడుగు పాటుకు ఒకరి మృతి

మల్కాన్‌గిరి, న్యూస్‌టుడే: మల్కాన్‌గిరి జిల్లా చిత్రకొండ సమితి స్వాభిమాన్‌లో ధులిపుట్ పంచాయతీ ఇస్కాబంద్ గ్రామంలో పిడుగు పడి ఒకరు మృతిచెందగా, మరొకరికి గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే... శనివారం ఇస్కాబంద్ గ్రామానికి చెందిన సరోజి దురి(8) చిన్నమ్మ కోలేము ఆవులను మేతకు అడవికి వెళ్లారు. సాయంత్రం తిరిగి వస్తుండగా భారీ వర్షం కురిసింది. ఈ సమయంలో పిడుగు పడి సరోజి కుప్పకూలిపోగా, చిన్నమ్మకు గాయాలయ్యాయి. గ్రామస్థులు వీరిద్దరిని ఆసుపత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి దురి మృతి చెందినట్లు తెలిపారు. ప్రాథమిక చికిత్స అనంతరం చిన్నమ్మను చిత్రకొండ ఆరోగ్య కేంద్రంలో చేర్చారు. ప్రస్తుతం బాలిక ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు చెప్పారు.

శబరి శ్రీక్షేత్రంలో కార్తికమాస ఏర్పాట్లు

కొరాపుట్, న్యూస్‌టుడే: కొరాపుట్ శబరి శ్రీక్షేత్రంలో పవిత్ర కార్తికమాసం సందర్భంగా నెల రోజులపాటు నిత్య పూజలు, దర్శనాలు చేసుకునేందుకు వీలుగా 100 పడకల ప్రత్యేక ఆధ్యాత్మిక ఆశ్రమం ఏర్పాటు చేశారు. ఈ ఆశ్రమానికి పలు జిల్లాలతోపాటు ఇతర రాష్ట్రాల నుంచి వృద్ధులు, భక్తులు 60 మంది చేరుకున్నారు. నామమాత్రపు రుసుము చెల్లింపుతో భక్తుల సామగ్రి భద్రపర్చుకునే లాకర్, మంచం, ప్రసాద సేవనం ఏర్పాటు చేస్తున్నట్లు మందిర ధర్మకర్త జగబంధు సామల్ తెలిపారు.



పొరుగు జిల్లాల నుంచి, రాష్ట్రాల నుంచి శబరి శ్రీక్షేత్రం చేరుకున్న భక్తులు

అటవీశాఖ భూముల ఆక్రమణ

ఖరగ్‌పూర్, న్యూస్‌టుడే: పశ్చిమ మిడ్నాపూర్ జిల్లా సాల్బోని పరిధిలో గోకుల్‌పూర్, పిరకులి ప్రాంతంలో ఉన్న 50 హెక్టార్ల అటవీ భూమిని రాత్రికి రాత్రి కొందరు గ్రామస్థులు ఆక్రమించుకున్నారు. ఆక్రమణలను అడ్డుకునేందుకు వెళ్లిన అటవీ శాఖ సిబ్బందిపై ఆ ప్రాంతవాసులు దాడి చేశారు. ఈ ఘటనలో ముగ్గురు గాయపడ్డారు. దీనిపై అసిస్టెంట్ డివిజనల్ ఫారెస్టు ఆఫీసర్ కానూ చక్రవర్తి సాల్బోని పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు అక్కడికి చేరుకుని భూములు స్వాధీనం చేసుకున్నారు. ఆక్రమణలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.


ఆక్రమణకు గురైన అటవీ భూమి

విద్యార్థుల్లో దేశభక్తి పెంపొందించడం లక్ష్యంగా..


మాట్లాడుతున్న బ్రహ్మపుర శాసనసభ్యుడు కె.అనిల్ కుమార్, చిత్రంలో అతిథులు, నిర్వాహకులు

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: మాతృభూమి అభివృద్ధికి, దేశ భద్రతకు అంతా కలిసికట్టుగా ముందుకు సాగుదామని, ఈమేరకు శపథం చేద్దామని బ్రహ్మపుర శాసనసభ్యుడు కె.అనిల్ కుమార్ పిలుపునిచ్చారు. భారత వికాస్ పరిషత్ స్వామి వివేకానంద బ్రహ్మపుర శాఖ ఆధ్వర్యంలో ఆదివారం 'భారత్ కో జానో' పేరిట దేశభక్తి గానం పోటీలు జరిగాయి. గుసానినువాగాం కె.సి.పబ్లిక్ స్కూల్లో జరిగిన ఇందులో శాసనసభ్యుడు అనిల్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. భగవాన్ త్రిపాఠి, బాబులి నందొ, సమేంద్ర దాస్, రామచంద్ర దొళాయి, రాజకిశోర్ స్వయిన్ తదితరులు పాల్గొని మాట్లాడారు. విద్యార్థుల్లో దేశభక్తి పెంపొందించడం, నైతిక విలువల అభివృద్ధి ఈ కార్యక్రమం లక్ష్యమని వారు పేర్కొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి ఉద్యమిద్దాం

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: బ్రహ్మపురలో నెలకొన్న వివిధ ప్రజా సమస్యల పరిష్కారానికి ఉద్యమిద్దామని బ్రహ్మపుర ప్రెస్ క్లబ్ ప్రతినిధులు పేర్కొన్నారు. క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నికైన తర్వాత ఆదివారం తొలి సమావేశాన్ని నిర్వహించారు. అధ్యక్షుడు అశోక్ బ్రహ్మ అధ్యక్షత వహించారు. కార్యదర్శి ప్రహ్లాద సాహు, ఉపాధ్యక్షుడు అభయ పాఢి, సంయుక్త కార్యదర్శి డి.గోపాల రెడ్డి, కోశాధికారి శిబనారాయణ పండా పాల్గొన్నారు. బ్రహ్మపురలోని ఎమ్మెకేసీజీ వైద్య కళాశాల ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలపై ఇటీవల క్లబ్ ఆధ్వర్యంలో ఆరోగ్య శాఖ మంత్రికి వినతిపత్రం ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. జర్నలిస్టుల సంక్షేమానికి కృషి చేద్దామని వారు పేర్కొన్నారు.


మాట్లాడుతున్న అధ్యక్షుడు అశోక్ బ్రహ్మ, చిత్రంలో ఇతర ప్రతినిధులు

న్యూట్రిహబ్‌ఫ్లెక్స్‌కు పోషక అనాజ్ పురస్కారం


అవార్డుతో కె.ఉషానాగ

సిమిలిగుడ, న్యూస్‌టుడే: సునాబెడ హాల్ టౌన్‌షిప్‌కు చెందిన కె.ఉషానాగ ప్రమోటర్‌గా సంబంధించిన న్యూట్రిహబ్‌ఫ్లెక్స్ ఎల్‌ఎల్‌పీ సంస్థకు పోషక అనాజ్-2024 పురస్కారం లభించింది. హైదరాబాద్‌కు చెందిన ఐఐఎంఆర్ న్యూట్రో హబ్ ఆధ్వర్యంలో శనివారం రాత్రి నోవాహోటల్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో చిరుధాన్యాలపై ప్రజల్లో చైతన్యం కలిగించే సంస్థలు, వ్యక్తులను సత్కరించారు. న్యూట్రిహబ్‌ఫ్లెక్స్ ఎల్‌ఎల్‌పీ సంస్థ చిరుధాన్యాలపై ప్రజల్లో చైతన్యం కలిగించేదుకుగాను సంస్థ నిర్వాహకురాలు కె.ఉషానాగకు పోషక అనాజ్ పురస్కారాన్ని కర్ణాటక రాష్ట్ర వ్యవసాయ మంత్రి ఎన్.చలువరాయస్వామి అందజేశారు. హైదరాబాద్‌కు చెందిన అవని వారధి ఛారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఉషకు సమాజ సేవలకు దసరా పురస్కారం అందజేశారు.

ఉచిత వైద్య శిబిరం... జయపురం, న్యూస్‌టుడే: పట్టణంలో అగర్సన్ భవన్ కల్యాణ మండపంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం జరిగింది. భువనేశ్వర్‌లో ఉన్న మనిపాల్ ఆసుపత్రి తరఫున నిర్వహించిన ఈ శిబిరాన్ని శాసనసభ్యుడు తారాప్రసాద్ వాహినిపతి ప్రారంభించారు. వైద్యులు డా. దివ్యరంజన్ బెహర(కార్డియోలజిస్ట్), డా. దీపక్‌కుమార్ పరిడా(న్యూరో), డా. బినేష్‌కుమార్(ఆర్థో), డా. సదాశివ్‌మిశ్ర(మెడిసిన్) రోగులను పరీక్షించి ఉచిత మందుల అందజేశారు. 114 మంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు

బ్రహ్మపుర క్రీడలు, న్యూస్‌టుడే: భువనేశ్వర్‌లోని పాఖారిపుట్ ఇండోర్ స్టేడియంలో రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్ బ్యాడ్మింటన్ పోటీలు శనివారం ప్రారంభమయ్యాయి. రాష్ట్ర బ్యాడ్మింటన్ సంఘం ఆధ్వర్యంలో మూడు రోజులపాటు నిర్వహిస్తున్న ఇందులో రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన 120 మంది బాలబాలికలు సింగిల్స్, డబుల్స్ పోటీల్లో తలపడుతున్నారు. తొలిరోజు జరిగిన మ్యాచుల్లో భువనేశ్వర్, కటక్, ఢెంకనాల్, సుందర్‌గఢ్, ఖుర్దా, బాలేశ్వర్, రాయగడ బాలబాలికలు గెలుపొందారు. నిర్వాహక సంఘం ఉపాధ్యక్షుడు ప్రదీప్‌కుమార్ పట్నాయక్, కార్యదర్శి నిలిన్‌కుమార్, ముఖ్య రిఫరీ అసిత్‌పట్నాయక్ తదితరులు ఆయా పోటీలను పర్యవేక్షిస్తున్నారు.


పోటీలకు ఎంపికైన జట్టు క్రీడాకారులు, చిత్రంలో క్రీడావిభాగం అధికారులు

జాతీయ పారా స్విమ్మింగ్ పోటీలకు రాష్ట్ర క్రీడాకారులు

బ్రహ్మపుర క్రీడలు, న్యూస్‌టుడే: గోవాలో ఈ నెల 19వ తేదీ నుంచి 22వ తేదీ వరకు జరుగనున్న 24వ జాతీయ పారా స్విమ్మింగ్ పోటీలకు రాష్ట్ర క్రీడాకారులు సిద్ధమయ్యారు. ఈమేరకు జట్టు క్రీడాకారులు శనివారం రాత్రి గోవాకు బయలుదేరారు. అంతకుముందు భువనేశ్వర్‌లోని కళింగ మైదానంలో క్రీడావిభాగం సంచాలకుడు సిద్ధార్థ్ దాస్, సంయుక్త కార్యదర్శి శైలేంద్రకుమార్ జెనా, రాష్ట్ర హాకీ ప్రమోషన్ కేంద్రం సీఈఓ దీపాంకర్ మహాపాత్ర్ తదితరులు పోటీల్లో ఉత్తమ ప్రదర్శన చూపాలని క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర క్రీడావిభాగం ఆయా వివరాలను 'ఎక్స్'లో వెల్లడించింది.

అంధుల క్రికెట్ పోటీల్లో కొరాపుట్



బహుమతితో కొరాపుట్ క్రీడాకారులు, చిత్రంలో అతిథులు

బ్రహ్మపుర క్రీడలు, న్యూస్‌టుడే: రాష్ట్ర క్రీడలు, యువజన సర్వీసుల విభాగం, ఒడిశా అంధుల క్రికెట్ సంఘం తరఫున జరిగిన 9వ రాష్ట్రస్థాయి అంధుల క్రికెట్ పోటీలు శనివారం ముగిశాయి. భువనేశ్వర్‌లోని హైటెక్ మెడికల్ కళాశాల క్రీడామైదానంలో జరిగిన తుదిపోరులో కొరాపుట్ జట్టు మయూర్‌భంజ్ జట్టుపై 7 వికెట్ల తేడాతో గెలుపొందింది. తుదిమ్యాచులో తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్ చేసిన మయూర్‌భంజ్ జట్టు నిర్ణీత ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 119 పరుగులు చేసింది. ప్రత్యర్థి జట్టు 12.2 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 120 పరుగులు చేసి విజయం సాధించారు. హైటెక్ గ్రూపు సంస్థల అధ్యక్షుడు తిరుపతి పాణిగ్రహి విజేతలకు బహుమతులు అందించారు. క్రీడాశాఖ అధికారులు శైలేంద్రకుమార్ జెనా, రాష్ట్ర అంధుల క్రికెట్ సంఘం కార్యదర్శి సన్యాసికుమార్ బెహరా తదితరులు పాల్గొన్నారు.

అంతర్ పాఠశాలల చదరంగం పోటీలు


జూనియర్ విభాగంలో బాలల చదరంగం ఆట

బ్రహ్మపుర క్రీడలు, న్యూస్‌టుడే: 'రోటరీ యూత్ యుక్తిఫెస్ట్-2024' కార్యక్రమంలో భాగంగా బ్రహ్మపుర రోటరీ క్లబ్ తరపున ఆదివారం అంతర్‌పాఠశాలల చదరంగం పోటీలు జరిగాయి. ప్రేమ నగర్‌లోని రోటరీ సామాజిక భవనంలో నిర్వహించిన పోటీల్లో బ్రహ్మపుర పురపాలక సంఘం పరిధి ఛత్రపురానికి చెందిన 20 పాఠశాలల జూనియర్, సీనియర్ విభాగాల్లో ఐదుతరగతి నుంచి పదో తరగతి విద్యార్థులు పాల్గొన్నారు. మొదటి మూడు స్థానాల్లో నిలిచిన వారికి నవంబరు 14వ తేదీన జరగనున్న వేడుకల్లో బహుమతులందజేస్తారు. క్లబ్ అధ్యక్షుడు ఆర్‌ఎల్‌తరుణ్, కార్యదర్శి కేవీజీ రవికుమార్, ప్రాజెక్టు ఛైర్మన్ మితెన్ భుయ్య తదితరులు పోటీలను పర్యవేక్షించారు.

ఖేలో ఇండియా మహిళా ఖోఖో విజేత ఒడిశా


బహుమతితో రాష్ట్ర క్రీడాకారిణులు

బ్రహ్మపుర క్రీడలు, న్యూస్‌టుడే: తమిళనాడులోని కోయంబత్తూరులో జరిగిన ఖేలో ఇండియా సీనియర్ మహిళా ఖోఖో పోటీల్లో రాష్ట్ర జట్టు క్రీడాకారిణులు విజేతగా నిలిచారు. శ్రీవాణీ ఇంటర్నేషనల్ స్కూల్ ప్రాంగణంలో శనివారం నిర్వహించిన తుదిపోరులో రాష్ట్ర జట్టు 14-8 పాయింట్లతో తమిళనాడు జట్టుపై గెలుపొంది పసిడి పతకాన్ని గెలుచుకుంది. ముగింపు కార్యక్రమంలో ఆయా జట్ల క్రీడాకారులు బహుమతులతోపాటు నగదు పారితోషికాలు కూడా అందుకున్నారు. రాష్ట్ర ఖోఖో సంఘం అధ్యక్షుడు నారాయణ పాత్ర్, కార్యదర్శి ప్రద్యుమ్న మిశ్రా విజేతలను, శిక్షకుడు భరత్‌కుమార్ ప్రధాన్‌లకు అభినందనలు తెలిపారు.

మహిళా క్రికెట్ క్రీడాకారులకు సన్మానం


క్రీడాకారిణికి జర్సిని అందజేస్తున్న పురాధ్యక్షుడు

జయపురం, న్యూస్‌టుడే: జయపురం సబ్‌డివిజన్ క్రీడా అసోసియేషన్ తరఫున జిల్లా మహిళా క్రికెట్ జట్టుకు శనివారం రాత్రి సన్మానం జరిగింది. సబ్‌డివిజనల్ అసోసియేషన్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమానికి అసోసియేషన్ ఎడిటర్ రబినాయక్ అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథిగా పురాధ్యక్షుడు నరేంద్రమహంతి హాజరయ్యారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో పూరీలో జరిగిన అంతర్ జిల్లా క్రికెట్ టోర్నమెంట్‌లో కొరాపుట్ జట్టు రన్నరప్‌గా నిలిచింది. ఈ సందర్భంగా వారికి జర్సీలను అందజేశారు.

వ్యాన్ ద్విచక్రవాహనం ఢీకొని ఒకరి మృతి

సిమిలిగుడ, న్యూస్‌టుడే: నందపూర్ సమితి కేంద్రం వద్ద ఆదివారం ఉదయం ద్విచక్రవాహనాన్ని వ్యాన్ ఢీకొని ఒకరు మృతి చెందారు. ఠాణా అధికారిని మమతాపండా అందించిన వివరాల ప్రకారం హికిమ్‌గుడ పంచాయతీ సంకిడి మజగూడ గ్రామానికి చెందిన రఘునాథ్ హంతాల్ (20), తన తమ్ముడు అశోక్, స్నేహితుడు జలంధర్ బిసోయిలు ద్విచక్ర వాహనంపై నందపూర్ వస్తుండగా ఎదురుగా వస్తున్న పికప్ వ్యాన్ ఢీకొంది. ఈ ఘటనలో రఘునాథ్ హంతాల్ అక్కడికక్కడే మృతి చెందాడు. అశోక్, జలంధర్‌లు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానికులు తక్షణం నందపూర్ ప్రభుత్వ ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం వైద్యులు సలహా మేరకు కొరాపుట్‌లోని లక్ష్మణ్‌నాయక్ వైద్య కళాశాలలో చేర్చారు. నాథ్ మృతదేహాన్ని పరీక్షకు పంపారు.

చెరువులో పడి బాలుడు మృత్యువాత

నవరంగపూర్, న్యూస్‌టుడే: చెరువులో పడి బాలుడు మృతి చెందిన ఘటన నవరంగపూర్ జిల్లాలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఉమ్మర్‌కోట్ ఠాణా పరిధి బూర్జ గ్రామానికి చెందిన ప్రకాష్ హరిజన్ (14) ఆదివారం ఉదయం సమీపంలో చెరువును స్నానం చేసేందుకు స్నేహితులతో కలిసి వెళ్లాడు. చెరువులో దిగిన బాలుడు లోతు అంచనా వేయలేక మునిగిపోయాడు. స్నేహితులు కుటుంబీకులకు సమాచారం ఇవ్వగా హుటాహుటిన వచ్చి బయటకు తీసి ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు చెప్పారు. శవపరీక్ష అనంతరం మృతదేహాన్ని పోలీసులు కుటుంబీకులకు అప్పగించారు.

పన్నెండు గంటల్లో బాలికను కాపాడిన పోలీసులు

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: బ్రహ్మపురలోని బి.ఎన్.పూర్ ఠాణా పరిధిలోని ఓ ప్రాంతానికి చెందిన 16 ఏళ్ల బాలిక కనిపించడం లేదంటూ ఆమె తల్లిదండ్రులు శనివారం ఠాణాలో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని 12 గంటల్లో బాధిత బాలికను కాపాడి, వారి తల్లిదండ్రులకు అప్పగించినట్లు బ్రహ్మపుర ఎస్పీ శరవణ వివేక్ ఎం. ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పోలీసు బృందం బాలికను ఖుర్దా రైల్వే స్టేషన్‌లో కాపాడిందని ఆయన పేర్కొన్నారు.

విద్యుత్తు స్తంభంపై మంటలు



బ్రహ్మపురలో ప్రసూతి ఆసుపత్రి రోడ్డులోని సుబ్బారావు కూడలి సమీపాన ఆదివారం సాయంత్రం ఓ విద్యుత్తు స్తంభంపై షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. ఎగసిపడ్డ మంటల్లో స్తంభంపై ఉన్న విద్యుత్తు, కేబుల్ తీగలు తదితరాలు కాలిపోయాయి. అగ్నిమాపక కేంద్రం సిబ్బంది మంటలను నియంత్రించారు.

–న్యూస్‌టుడే, బ్రహ్మపుర నగరం


ఒడిశా-ఆంధ్రా మధ్య ఘాట్ రోడ్డుపై నిలిచిపోయిన వాహనాలు

వాహనాలు ఢీకొని ట్రాఫిక్‌కు అంతరాయం

కొరాపుట్, న్యూస్‌టుడే: ఒడిశా-ఆంధ్రా సరిహద్దు ఘాట్ రోడ్డుపై 7 కి.మీ. మేర 4 గంటల పాటు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ఒక లారీ, ఆయిల్ ట్యాంకర్ ఎదురెదురుగా ఢీకొనడంతో వాహనాలు నిలిచిపోయి ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. సాలూరుకు చెందిన పోలీసు సిబ్బంది, అగ్నిమాపక సిబ్బంది రాకపోకలు సాగేలా చర్యలు తీసుకున్నారు.

'ఎర'ను చంపేసి.. తప్పించుకున్న 'పులి'

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: గంజాం జిల్లాలో 'పులి' సంచారంతో అటు ప్రజలు, ఇటు అటవీ సిబ్బంది నిద్రలేని రాత్రుళ్లు గడుపుతున్నారు. దాన్ని పట్టుకునేందుకు అటవీ సిబ్బంది 'ఎర'గా వేసిన గేదెను పులి చంపేసి.. సిబ్బంది వాసన పసిగట్టి అక్కడ నుంచి పారిపోయింది. జిల్లాలో ఉత్తర ఘుముసుర అటవీ డివిజన్ పరిధిలో గంగపూర్ అటవీ రేంజ్‌లోని మాలతి కొండ ప్రాంతంలో మహారాష్ట్ర నుంచి వచ్చిన పులి కొన్ని రోజులుగా సంచరిస్తోంది. దాన్ని పట్టుకునేందుకు సిమిలిపాల్ నుంచి పులుల్ని పట్టుకునే ర్యాపిడ్ రెస్పాన్స్ బృందం జిల్లాకు చేరుకున్న సంగతి తెలిసిందే. వారంతా పులి సంచరిస్తున్న ప్రాంతంలో ఎరగా ఓ గేదెను చెట్టుకు కట్టారు. సమీపంలో బోనుతో మాటు వేశారు. శుక్రవారం రాత్రి ఎరగా వేసిన గేదెను చంపి దాన్ని లాక్కుపోయందుకు పులి ప్రయత్నించింది. అది చెట్టుకు కట్టి ఉండడంతో సాధ్యం కాలేదు. అక్కడికి 50 60 మీటర్ల దూరంలో బోనుతో మాటు వేసిన అటవీ సిబ్బంది పసిగట్టిన అది అక్కడ నుంచి సమీపంలోని అటవీ ప్రాంతంలోకి పారిపోయింది. పులి మాలతి కొండ ప్రాంతం నుంచి ధారాకోట సమితిలో ఝుడబంధ-డి.సింగిపూర్ మధ్యలోని చెంబిడి అడవుల్లోకి పారిపోయి ఉంటుందని అధికారులు అనుమానిస్తున్నారు.

శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలి



ప్రసంగిస్తున్న మిశ్రా వేదికపై కార్యవర్గ సభ్యులు, అతిథులు

రాయగడ, న్యూస్‌టుడే: గత ప్రభుత్వం రాష్ట్రంలో ఉన్న అన్ని ప్రభుత్వ శాఖల్లో ఒప్పంద ఉద్యోగులను నియమించింది. వీరిని శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలని ఒడిశా ఒప్పంద ఉద్యోగులు సంఘం సభ్యులు కోరారు. ఆదివారం స్థానిక బిజుపట్నాయక్ కల్యాణ మండపంలో జిల్లా స్థాయి సమావేశం జరిగింది. రాష్ట్ర సంఘం ఉపాధ్యక్షుడు పూర్ణచంద్రమాఝి మాట్లాడుతూ కొవిడ్ సమయంలో నుంచి ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో ఉన్న ఒప్పంద ఉద్యోగులను ప్రస్తుత సర్కారు విధుల నుంచి తప్పించడంపై మండిపడ్డారు. తక్షణమే వారిని విధుల్లోకి చేర్చుకోవాలని లేదంటే రాష్ట్రస్థాయి ఆందోళన తప్పదన్నారు. జిల్లా సంఘం అధ్యక్షుడు సుశాంత్‌కుమార్ పట్నాయక్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో కార్యదర్శి ఉమాపాణిగ్రహి, రాష్ట్ర కమిటీ సభ్యులు సరోజ కుమార్, లోకనాథ్‌మిశ్రా తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రిలో నిలిచిన వర్షం నీరు


అత్యవసర సేవల వార్డులో వాననీరు

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: పర్లాఖెముండిలో ఆదివారం మధ్యాహ్నం కురిసిన వర్షానికి పట్టణంతో పాటు జిల్లా ప్రధానాసుపత్రి ప్రాంగణంలో అత్యవసర సేవల వార్డులో వర్షం నీరు నిలిచింది. చికిత్స కోసం వచ్చిన రోగులు ఇబ్బందులు పడ్డారు. ఈ సేవల వార్డు లోతట్టు ప్రాంతంలో ఉండడంతో గదుల్లోకి నీరు చేరింది. ఇలాంటి సమస్యలు తలెత్తకుండా చూడలని రోగులు కోరుతున్నారు.

బ్రహ్మపురలో వర్షం.. రహదారులపై మురుగు నీరు

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: నగరంలో ఆదివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ ఎండా-మబ్బు వాతావరణం నెలకొంది. మధ్యాహ్నం 3 గంటల సమయంలో హఠాత్తుగా భారీ వాన మొదలైంది. కొంత సేపటి తర్వాత ఆగాగి ఒక మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయి. దీంతో నగరంలోని పలు ప్రాంతాల్లో మురుగు కాలువల్లో నీరు సక్రమంగా పారక రహదారులపై నిలిచిపోయింది.


సిటీ హై స్కూలు రహదారిపై మడుగులు కట్టిన మురుగు నీరు

చిత్రకారుల చేతుల్లో ఒదిగిపోయిన రతన్‌టాటా


రతన్‌టాటా చిత్రాన్ని రూపొందిస్తున్న విద్యార్థులు

రాయగడ, న్యూస్‌టుడే: పట్టణంలో స్పందన సాహితి సాంస్కృతిక సంస్థ 28వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన చిత్రలేఖనం పోటీలకు మంచి స్పందన లభించింది. ఆదివారం రామలింగేశ్వర ఆలయ కల్యాణ మండపంలో జరిగిన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు స్వర్గీయ రతన్‌టాటా చిత్రం అద్భుతంగా రూపొందించి పలువురు ప్రశంసలు పొందారు. జూనియర్, సీనియర్ విభాగాల్లో 87 మంది విద్యార్థులు హాజరయ్యారు. డా. పతివాడ తులసీదాస్, కొండవలస కృష్ణమూర్తి పట్నాయక్‌లు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. వచ్చేనెల 10న జరిగే వార్షికోత్సవ సభలో బహుమతులు అందజేయనున్నట్లు సంస్థ అధ్యక్షుడు గుడ్ల గౌరీశంకర్‌ప్రసాద్ తెలిపారు.

వేడుకగా శారద్ సన్మాన్


జ్ఞాపిక అందుకుంటున్న సంఘ శ్రీ సంస్థ

ఖరగ్‌పూర్, న్యూస్‌టుడే: ఖరగ్‌పూర్ లైవ్ ప్రచార సంస్థ ఆధ్వర్యంలో శనివారం రాత్రి జరిగిన శారద్ సన్మాన్ కార్యక్రమం వేడుకగా జరిగింది. శంకర్‌రాయ్, సీతమారాయ్ గుప్తా పర్యవేక్షించారు. పురాధ్యక్షురాలు కల్యాణి ఘోష్, ఉపాధ్యక్షుడు తైమూరు ఆలీఖాన్, హిజలీ స్కూల్ ప్రిన్సిపల్ రవిశంకర్ చటర్జీ, వార్డు కౌన్సిలర్ అపూర్వ ఘోష్ తదితరులు అతిథులుగా హాజరయ్యారు. పట్టణంలో ఈ ఏడాది దుర్గాపూజల్లో ఏర్పాటు చేసిన మండపాల్లో ఉత్తమమైనవి ఎంపిక చేసి నిర్వాహకులకు జ్ఞాపికలు అందజేసి సత్కరించారు.

డీహెచ్‌హెచ్‌లో ఎన్‌సీడీ బృందం


వైద్యులతో మాట్లాడుతున్న అధికారులు


జయపురం, న్యూస్‌టుడే: జయపురం జిల్లా ప్రధానాసుపత్రిలో(డీహెచ్‌హెచ్) రాష్ట్ర ఎన్‌సీడీ(నాన్ కమ్యూనికేబుల్ డీసీజ్)బృందం ఆదివారం పర్యటించారు. రానున్న నవంబరులో కేంద్రం నుంచి కామన్ రివ్యూమిషన్(సీఆర్ఎం) బృందం పర్యటించనుంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర బృందం ఆదివారం సందర్శించినట్లు మేనేజర్ మధుస్మిత తెలిపారు. వీరిలో ఎన్‌సీడీ పరిశీలికురాలు డా.గిరిజాశంకర్ మిశ్రా, డా. లలిత్ మోహన్ సాహు ఆసుపత్రిలో వివిధ వార్డులను సందర్శించి దస్త్రాలను పరీక్షించారు.

మొక్కజొన్న ఉత్పత్తి - లాభాలు బాగు


కార్యక్రమంలో వేదికపై మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్

జయపురం, న్యూస్‌టుడే: కొరాపుట్ జిల్లా కుంద్ర శాస్త్రి మైదానంలో మా పాటదేయి మిషన్‌శక్తి తరపున మహిళలచే ప్రారంభించిన మొక్కజొన్న ఉత్పత్తి కంపెనీ వార్షికోత్సవ కార్యక్రమం ఆదివారం జరిగింది. వ్యవసాయశాఖ మాజీ అధికారి జి.వెంకటరెడ్డి అధ్యక్షతన ముఖ్య అతిథిగా సబ్‌కలెక్టర్ సస్యరెడ్డి హాజరయ్యారు. మొక్కజొన్న ఉత్పత్తిలో మహిళా రైతులకు శిక్షణకు అవసరమైన యంత్రాలు అందజేస్తామన్నారు. ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. జిల్లా వ్యవసాయ శాఖాధికారి ప్రదీప్‌కుమార్ మహంతి, సమితి అధ్యక్షురాలు రాజేశ్వరి పోర్జా, బీడీఓ కపిలేశ్వర్ తాండి, ఓర్మాస్ సీఈఓ రోషన్‌కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

శక్తికాంత్‌తో మోహన్ చర్చలు


మోహన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న శక్తికాంత్, చిత్రంలో మనోజ్, నికుంజ

భువనేశ్వర్, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝి శనివారం రాత్రి ముంబయిలో రిజర్వు బ్యాంకు గవర్నరు శక్తికాంత్‌దాస్‌ను కలిశారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి గురించి వివరించారు. వ్యవసాయ, పారిశ్రామిక రంగాల ప్రగతికి చేపట్టిన కార్యక్రమాలపై కూలంకషంగా చర్చించారు. ఈ భేటీలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మనోజ్ అహుజా, సీఎం ప్రత్యేక కార్యదర్శి నికుంజ బిహారీ ధొళా పాల్గొన్నారు.

టౌన్ ఠాణా ఎదుట కాంగ్రెస్ నిరసన ప్రదర్శన


ఖరగ్‌పూర్, న్యూస్‌టుడే: రాష్ట్రంలో శాంతిభద్రతను నెలకొల్పాలని, మహిళలపై అత్యాచారాలు జరగకుండా చూడాలని డిమాండ్ చేస్తూ పట్టణ కాంగ్రెస్ శనివారం టౌన్ ఠాణా ఎదుట నిరసన చేపట్టింది. రాష్ట్రవ్యాప్తంగా జరిగిన ఈ నిరసనల్లో పట్టణ కాంగ్రెస్ అగ్రనాయకులు అమల్‌దాస్, దేబాశిష్‌ఘోష్, మధుకామి, ఉజ్వల్ ముఖర్జీ, అమిత్‌శర్మ తదితరులు పాల్గొన్నారు. ప్రభుత్వ పని తీరుపై దుమ్మెత్తిపోశారు.


నిరసన ప్రదర్శనలో పలువురు

22న లారీ యజమానుల సంఘం ఎన్నికలు

సిమిలిగుడ, న్యూస్‌టుడే: సిమిలిగుడకు చెందిన సునాబెడ లారీ యజమానుల సంఘం ఎన్నికలు ఈ నెల 22వ తేదీన జరుగుతాయని సునాబెడ ఎస్‌డీపీఓ మనోబ్రాత్ శత్పథి తెలిపారు. కొంతకాలంగా ఉన్న విభేదాలతో ఎన్నికలు జరగలేదు. అనేకమంది సభ్యులు కలెక్టర్, ఎస్పీని కలిసి ఎన్నికలు నిర్వహించాలని కోరారు. ఈ మేరకు యంత్రాంగం వీటి నిర్వహణ బాధ్యతను ఎస్‌డీపీఓకు అప్పగించారు. సిమిలిగుడ పోలీసులు సంఘం సభ్యులతో సమావేశం జరిగింది. ఈ నెల 22వ తేదీన జరగనున్న ఎన్నికలకు అక్టోబరు 5వ తేదీన నామినేషన్ల పత్రాలు విక్రయాలు జరిగాయి. 12న నామినేషన్లు దాఖలయ్యాయి. 17వ తేదీన పరిశీలిన, ఉపసంహరణ అనంతరం పోటీల్లో నిలిచిన అభ్యర్థుల జాబితాను శనివారం రాత్రి పోలీసు అధికారులు ప్రకటించారు. అధ్యక్ష పదవి కోసం త్రినాథ్ కంట, సునీల్ అగర్వాల్, ఉపాధ్యక్షుల పదవి కోసం వినోద్‌కుమార్ సాహు, ప్రమోద్ కుమార్‌జెనా, పద్మనాభ బిసోయి, గౌరీ శంకర్ బారిక్, కార్యదర్శి పదవి కోసం ఎం.సతీష్‌కుమార్, అజయ్‌కుమార్ సింగ్ ఇతర పదవులు కోసం పోటీలు జరగనున్నాయి.

నవంబరులో భాజపా సంస్థాగత ఎన్నికలు


ప్రతాప్‌చంద్ర షడంగి

భువనేశ్వర్, న్యూస్‌టుడే: రానున్న నవంబరులో రాష్ట్ర భాజపా సంస్థాగత ఎన్నికలు జరగనున్నాయి. ఇందుకోసం పార్టీ కేంద్ర నాయకత్వం బాలేశ్వర్ ఎంపీ ప్రతాప్‌చంద్ర షడంగిని ఆదివారం పర్యవేక్షకునిగా నియమించింది. ప్రస్తుతం సభ్యత్వ నమోదు కార్యక్రమం జరుగుతోంది. నవంబరు ద్వితీయార్థంలో ఇది ముగియనుంది.

ప్లిజలిన్‌కు అభినందనలు



ప్లిజలిన్‌కు పుష్పగుచ్ఛం అందజేసిన క్రీడావిభాగం అధికారి రౌత్ తదితరులు

బ్రహ్మపుర క్రీడలు, న్యూస్‌టుడే: ఉజ్బెకిస్థాన్‌లో ఇటీవల జరిగిన 8వ ఆసియా పెన్‌కాక్ సిలెట్ పోటీల్లో రాష్ట్ర క్రీడాకారిణి ప్లిజలిన్ తొరాయి కాంస్య పతకం గెలుచుకున్న సంగతి తెలిసిందే. భువనేశ్వర్ చేరుకున్న ఆమెకు బిజు పట్నాయక్ విమానాశ్రయంలో రాష్ట్ర క్రీడావిభాగం అధికారులు పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. కార్యక్రమంలో క్రీడావిభాగం అధికారి బిజయకుమార్ రౌత్ తదితరులు పాల్గొన్నారు.

భాజపా అభ్యర్థి శుభజిత్‌రాయ్

ఖరగ్‌పూర్, న్యూస్‌టుడే: రాష్ట్ర భాజపా అధిష్ఠానం నవంబరు 13న జరగనున్న ఆరు శాసనసభ స్థానాల ఉప ఎన్నికలకు అభ్యర్థుల పేర్లు కోల్‌కతాలో ప్రకటించింది. ఇందులో మిడ్నాపూర్ నుంచి శుభజిత్‌రాయ్‌ను ఎంపిక చేసింది. భాజపా అగ్ర నాయకుడు దిలీప్‌ఘోష్ శుభజిత్‌ను కలిసి అభినందించారు. ఎన్నికల ప్రచారం ప్రారంభించారు.

సేవలపై చర్చ

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: స్థానిక ఎన్‌టీఆర్ సేవా సమితి ఆధ్వర్యంలో రానున్న రోజుల్లో చేపట్టనున్న కార్యక్రమాలపై ఆదివారం చర్చించారు. ఉదయం గిరిమార్కెట్‌లోని ఆంధ్ర భాషాభివర్ధనీ సమాజం మినీ హాల్లో సేవా సమితి ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించింది. సమితి అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.శ్రీనివాసరావు, సీహెచ్.చక్రధర్ పలువురు ప్రతినిధులు పాల్గొని మాట్లాడారు. కార్తిక మాసంలో వన భోజనాలు, శీతాకాలంలో పేదలకు రగ్గుల పంపిణీ తదితరాలతోపాటు చేపట్టనున్న సేవా కార్యక్రమాలపై చర్చించారు.


చర్చిస్తున్న సేవా సమితి ప్రతినిధులు

ఓఏఎస్‌లో మెరిసిన ముత్యాలు


చిన్మయి భాగ్యశ్రీ మిశ్ర పి.అంకిత దొర

ఒడిశా పబ్లిక్ సర్వీస్ కమిషన్(ఓపీఎస్సీ) ఆధ్వర్యంలో 2022లో జరిగిన రాష్ట్ర పాలనా విభాగం (ఓఏఎస్) పరీక్షల ఫలితాలు శనివారం రాత్రి విడుదల అయిన విషయం తెలిసిందే. కొరాపుట్ జిల్లా జయపురంలో లక్ష్మీపూర్ సమితి తునపార గ్రామానికి చెందిన నారాయణసాహు కుమారుడు చిన్మయ్ గతంలో 188 ర్యాంకు సాధించి జిల్లా కార్మిక అధికారిగా విధులు నిర్వర్తిస్తున్నారు. ప్రస్తుతం రెండోసారి పరీక్ష రాసి 90వ ర్యాంకు సాధించారు. ●నవరంగపూర్‌లో టెంటులిఖుంటి సమితి దిగి పంచాయతీ పీఈవో సత్యజిత్ గాహన్ 186 ర్యాంకు సాధించారు. ●మల్కాన్‌గిరి జిల్లా మత్తిలి సమితి మెండుకలి గ్రామానికి చెందిన భాగ్యశ్రీ మిశ్ర 138 ర్యాంకు పొందారు. ●సిమిలిగుడకు చెందిన స్వాగతిక రౌత్ 389 ర్యాంకుతో, పి.అంకిత దొర 98వ ర్యాంకు సాధించారు. – సిమిలిగుడ, జయపురం, మల్కాన్‌గిరి, న్యూస్‌టుడే

వైభవంగా అక్షరబ్రహ్మ దేవాలయం ప్రారంభం


దప్పులతో స్వాగతం పలుకుతున్న ఆదివాసీలు


అక్షరబ్రహ్మ పూజల్లో పాల్గొన్న తెదేపా ఇన్‌ఛార్జి పడాల భూదేవి

భామిని, న్యూస్‌టుడే: భామిని మండలం సతివాడ సమీపంలోని నూకలమ్మ గూడ వద్ద అక్షరబ్రహ్మ నూతన ఆలయ ప్రారంభం అంగరంగ వైభవంగా జరిగింది. అక్షరబ్రహ్మ కో-ఆర్డినేటర్ సవర కరువయ్య ఆధ్వర్యంలో ఆదివారం ఒడిశా మాజీ సీఎం గిరిధర్ గోమాంగో చేతుల మీదుగా నిర్వహించారు. ముందుగా ఇరురాష్ట్రాల సరిహద్దు ప్రాంతాల గిరిజనులు ఆలయాన్ని అలంకరించారు. అనంతరం ఆదివాసీ మహిళలు థింసా నృత్యాలు, డప్పు వాయిద్యాలు, మేళతాళాలతో అతిథులకు ఘన స్వాగతం పలికారు. పాలకొండ తెదేపా ఇన్‌ఛార్జి పడాల భూదేవి, ప్రముఖ సామాజిక వేత్త గీతాశ్రీకాంత్, ఫౌండేషన్ ఛైర్మన్ గీతా శ్రీకాంత్ జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..అక్షరాన్ని దైవంగా భావించి పూజించడం గొప్ప సంప్రదాయమని కొనియాడారు. తితిదే నుంచి శ్రీవాణి ట్రస్టు సభ్యులు ఆలయ నిర్మాణానికి రూ.10 లక్షలు అందించారు. అనంతరం మధ్యాహ్నం 3,500 మందికి అన్న సంతర్పణ చేశారు. అక్షరబ్రహ్మ గురువు ఎస్‌పీ మంగయ్య, రాంప్రసాద్ గోమాంగో, దిగాన్‌సమి గోమాంగో, తిస్యాంగ్‌పాల్ గోమాంగో, కె. కామేశ్వరరావు, గంగారావుతో పాటు ఆంధ్రా, ఒడిశా నుంచి పలువురు గురువులు పాల్గొన్నారు.


పంచలోహ విగ్రహాలు, వస్తువులు

అందాల పుత్తడి గంగాడ ఇత్తడి

బలిజిపేట, న్యూస్‌టుడే: బలిజిపేట మండలంలోని గంగాడలో తయారవుతున్న పంచలోహ విగ్రహాలు, ఇత్తడి వస్తువులకు గుర్తింపు లభించింది. గ్రామానికి చెందిన డ్వాక్రా మహిళలు తయారు చేసిన పలు వస్తువులను ఈ నెల 21న విజయవాడలో జరగనున్న డ్వాక్రా ఉత్పత్తుల ప్రదర్శనకు ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు కేంద్ర మంత్రులు పాల్గొంటారని వెలుగు పీడీ వై. సత్యంనాయుడు తెలిపారు. శనివారం ఆయన గ్రామంలో పర్యటించి విగ్రహాలు, వస్తువులను పరిశీలించారు. తయారీదారులు, మహిళలతో మాట్లాడారు. మాజీ సర్పంచి జి.గౌరీశంకరరావు, తెదేపా నాయకుడు ఎస్. రాధాకృష్ణ, డీపీఎం అప్పారావు, ఏపీఎం ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రభుత్వ సాయంతో అడుగులు..

ఈ గ్రామంలో ఇత్తడి కార్మిక కుటుంబాలు 32 ఉన్నాయి. వీరికి ప్రభుత్వం రూ.72 లక్షల బ్యాంకు రుణం మంజూరు చేసింది. 35 శాతం రాయితీతో 12 కుటుంబాలకు రూ.2.5 లక్షల చొప్పున, 20 కుటుంబాలకు రూ.2 లక్షల చొప్పున అందజేశారు. దీంతో వారు సొంతంగా సామగ్రి తయారు చేస్తున్నారు. బయట నుంచి వచ్చే ఆర్డర్ల మేరకు రామాలయాలు, మందిరాల్లో ప్రతిష్ఠించేందుకు దేవతల విగ్రహాలు, పూర్ణ కలశాలు, విగ్రహాలు, గృహ వస్తువులు, ఇత్తడి వస్తువులు తయారు చేసి ఆన్‌లైన్ వ్యాపారం సాగిస్తున్నారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పుగోదావరి జిల్లాలకు తరలి వెళ్తున్నట్లు గ్రామస్థులు చెబుతున్నారు.


వస్తువులు పరిశీలిస్తున్న పీడీ సత్యంనాయుడు

జాతీయ పోటీల్లో దివ్యాంగుడి సత్తా


ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న తులసయ్య

ఆత్మవిశ్వాసం ముందు.. అంగవైకల్యం దిగదుడిపే అని ఆ యువకుడు నిరూపించాడు. నడవడమే కష్టం అనుకున్న పరిస్థితిలో.. జాతీయస్థాయి క్రీడాకారుడిగా గుర్తింపు తెచ్చుకున్నాడు. ఇటీవల గ్వాలియర్‌లో జరిగిన 8వ జాతీయ వీల్‌చైర్ బాస్కెట్‌బాల్ పోటీల్లో క్వార్టర్ ఫైనల్ వరకూ జట్టును నడిపించాడు. తనదైన శైలిలో అందర్నీ ఆకట్టుకుని ఉత్తమ ఆటగాడిగా పతకాన్ని, ప్రశంసా పత్రాన్ని అందుకున్నాడు ఇచ్ఛాపురం మండలం తులసిగాం గ్రామానికి చెందిన పండూరు తులసయ్య. – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం, ఇచ్ఛాపురం గ్రామీణం


జాతీయస్థాయి పోటీలో వ్యక్తిగతంగా సాధించిన పతకం

పోలియోతో నడవలేని స్థితి..

తులసయ్య చిరుప్రాయంలోనే పోలియో మహమ్మారి వల్ల నడవలేని స్థితి. ఆత్మవిశ్వాసమే ఆయుధంగా చదువు, క్రీడల్లో రాణించాడు. ఇటీవల జాతీయస్థాయిలో జరిగిన వీల్‌చైర్ బాస్కెట్‌బాల్ పోటీల్లో సత్తా చాటాడు. చక్రాల కుర్చీలో గిర్రున తిరుగుతూ.. ప్రత్యర్థి ఊహలకు అందకుండా గోల్ వేసే న్యాయనిర్ణేతలు, తోటి క్రీడాకారులను ఆకట్టుకున్నాడు. ఇటీవల కోయంబత్తూరులో జరిగిన దక్షిణభారత స్థాయి వీల్‌చైర్ పోటీల్లోనూ తులసయ్య బృందం రెండోస్థానంలో నిలువగా, ఇక్కడ కూడా తులసయ్య ప్రత్యేక ఆటతో గుర్తింపు పొందాడు.

ఆ క్రీడాకారుడి పరిచయంతో..

ఆంధ్రా విశ్వవిద్యాలయంలో బీఎస్సీ కంప్యూటర్ కోర్సు డిగ్రీ పూర్తిచేసిన తులసయ్య ఉపాధికోసం స్నేహితులతో కలిసి హైదరాబాద్ వెళ్లాడు. ప్రైవేటు సంస్థలో అవకాశం లభించింది. వీల్‌చెయిర్ బాస్కెట్‌బాల్ క్రీడాకారుడు చంద్రశేఖర్‌తో పరిచయం ఆయన్ను క్రీడాకారుడిగా మార్చింది. తెలంగాణా వీల్‌చెయిర్ బాస్కెట్‌బాల్ ఫెడరేషన్ అధ్యక్షురాలు పద్మ, కోచ్ సాహిల్ ఖాన్‌లు కలిశారు. తొలి పరీక్షలోనే నెగ్గిన తులసయ్యను వారి ఫెడరేషన్ క్రీడాకారుల్లోంచి చివరి ఆటగాడిగా ఎంపిక చేశారు. మిగిలిన వారితో కలిసి రెండు నెలల శిక్షణ పొందారు. ఈ నెల 10 నుంచి 13 వరకు గ్వాలియర్‌లోని అటల్ బిహారీ వాజ్‌పేయీ దివ్యాంగ క్రీడాకారుల శిక్షణ కేంద్రంలో జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొన్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి

వివిధ రాష్ట్రాల ప్రభుత్వాలు క్రీడాకారులకు చక్కటి ప్రోత్సాహం అందిస్తున్నారు. సొంతంగా వీల్‌చైర్ లేకపోవడంతో సాధన చేయలేకపోతున్నాను. రాష్ట్ర ప్రభుత్వం ఉపాధిని కల్పించడంతో పాటు, సాధనకు అవసరమైన వనరులను సమకూర్చాలని కోరుతున్నాను. రాష్ట్రం నుంచి కూడా జట్టును తయారుచేసి, సత్తా చాటుకుంటాం.
–పండూరు తులసయ్య, వీల్‌చైర్ బాస్కెట్‌బాల్ క్రీడాకారుడు

ఏనుగుల గుంపు కలకలం

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: గంజాం జిల్లా సన్నొఖెముండి సమితిలో దిగపాహండి అటవీ రేంజ్ పరిధిలోని పలాస పూర్-డెంగాపస్తా మార్గంలో హరిణా గ్రామం సమీపాన కొండ ప్రాంతంలోని అడవిలో ఆదివారం ఆయిదు ఏనుగుల గుంపు కలకలం రేపింది. శనివారం రాత్రి హరిణా ప్రాంతంలోని పంటపొలాలు వీటి వల్ల నష్టం జరిగినట్లు పలువురు రైతులు పేర్కొన్నారని పట్టపూర్ ఫారెస్ట్ ప్రమోద్ నాయక్ ఆదివారం విలేకరులకు చెప్పారు. గుంపులో 6 ఏనుగులు, నాలుగు ఆడ ఏనుగులున్నాయని, వాటి కదలికలపై నిఘా పెట్టడంతోపాటు రాత్రుళ్లు గస్తీ ముమ్మరం చేశామని ఆయన తెలిపారు. సమితిలోని హరిణా, గంగాపూర్, నరసింహగడ, బణిబాలి, సువాగడ, హరిజన కాలనీ, సింగిపూర్ సుమంతపూర్ తదితర గ్రామాల ప్రజలు ఏనుగుల గుంపు సంచారంతో తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు.


ఏనుగుల గుంపు తొక్కేయడంతో దెబ్బతిన్న పంట

భాషల పరిరక్షణ తప్పనిసరి: వీసీ

నెల్లూరు (విద్య), న్యూస్‌టుడే: భారతీయ భాషలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని వీఎస్‌యూ వీసీ విజయభాస్కరరావు ఉద్ఘాటించారు. లేకుంటే భవిష్యత్తులో ప్రమాదంలో పడతాయన్నారు. అఖిల భారత భాషా సాహిత్య సమ్మేళన్ ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని డీకే ప్రభుత్వ మహిళా కళాశాలలో సదస్సు చేపట్టారు. పలు రాష్ట్రాల నుంచి వచ్చిన సాహితీవేత్తలకు అవార్డులు, పురస్కారాలు అందించారు. కార్యక్రమంలో డీకే ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డి.గిరి, అఖిల భారత భాషా సాహిత్య సమ్మేళన్ జాతీయ అధ్యక్షుడు వీరేంద్రసింగ్, ప్రధాన కార్యదర్శి చతుర్వేది, తెలంగాణ అధ్యక్షులు సత్యమూర్తి, కార్యదర్శి చక్రవర్తి, మద్రాస్ విశ్వవిద్యాలయం ఆచార్యులు విజయలక్ష్మి, ఒడిశా కవయిత్రి సుశ్రీసంగీత మిశ్ర, ఆంధ్ర కవి లక్ష్మీరావు, హిందీ రచయిత రామలింగేశ్వరరావు, నారాయణ ఎమెన్ ఆకాడమీ ప్రిన్సిపల్ కె.సరోజినీదేవి, కవి పెరుగు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

దంపతుల ఆత్మహత్య?

బ్రహ్మపురనగరం, న్యూస్‌టుడే: గంజాం జిల్లా పురుషోత్తమపురం పోలీసుస్టేషన్ పరిధిలోని కాజిపల్లి శాసన గ్రామంలోని ఇంట్లో ఆదివారం రాత్రి దంపతుల మృతదేహాలను గుర్తించారు. భర్త సంతోష్‌సాహు మంచంపై, భార్య సస్మితసాహు మృతదేహాలు పడి ఉన్నాయి. కుటుంబ కలహాల నేపథ్యంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో వీరు ఆత్మహత్య చేసుకుని ఉంటారని అనుమానిస్తున్నారు. పోలీసులు గ్రామానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు.

అధ్వాన మార్గం..



ఇచ్ఛాపురం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో బస్సులు, ప్రయాణికుల వాహనాలు రాకపోకలు సాగించే మార్గం ఇది. ఏళ్ల తరబడి నిర్లక్ష్యం చేస్తుండటంతో వర్షం పడితే మరింత ఇబ్బందికరంగా మారుతుంది. ఇరు ద్వారాల నుంచి కొంత వరకు మాత్రమే సిమెంటు రహదారిని నిర్మించిన ఆర్టీసీ అధికారులు మధ్యభాగాన్ని మాత్రం వదిలేశారు. ఈ సమస్యను పరిశీలించి, అవసరమైన చర్యలు తీసుకుంటామని కమర్షియల్ మేనేజర్ శ్రీనివాసరావు తెలిపారు. –న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

నైపుణ్యాలే సోపానాలు..!



జిల్లాలో ఇంజినీరింగ్ కళాశాలలు : 4 విద్యార్థులు: సుమారు 10 వేల మంది

ఇంజినీరింగ్‌లో చేరగానే సాఫ్ట్‌వేర్ కొలువు దక్కించుకోవాలని విద్యార్థులు కలలు కంటున్నారు. ప్రస్తుతం ఆ రంగంలో ఉద్యోగం దక్కించుకోవడం.. అందులో స్థిరపడటం అంత సులువేం కాదని నిపుణులు సూచిస్తున్నారు. ఇప్పటికే ప్రారంభం కావాల్సిన నియామక ప్రక్రియ ఆలస్యమవుతోంది. ప్రముఖ సంస్థలు సైతం ఎంపికలు వాయిదా వేసుకుంటూ వస్తున్నాయి. జిల్లాలో ఇంజినీరింగ్ విద్య అభ్యసిస్తున్న చివరి సంవత్సరం విద్యార్థులు ఉద్యోగ నియామకాల కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు. కోర్ ఉద్యోగాల్లో అవకాశాలు మెరుగవుతున్నాయని.. వాటిపై దృష్టిపెట్టాలని పరిశ్రమ వర్గాలు సూచిస్తున్నాయి.

సృజనాత్మకత ఉంటేనే ఇంజినీరింగ్ విద్యార్థులకు కొలువులు

కోర్ ఉద్యోగాలపై దృష్టి సారించాలని నిపుణుల సూచన

జిజ్ఞాస పెరగాలి

ఇంజినీరింగ్ విద్యార్థులు పరిశ్రమ అవసరాలకు తగినట్లు వారిలోని నైపుణ్యాన్ని పెంచుకోవాలి. కళాశాల స్థాయిలో అందుబాటులో ఉన్న అన్ని వనరులు వినియోగించుకోవాలి. వారిలోని జిజ్ఞాస ద్వారానే నైపుణ్యం పెరుగుతుంది. నవంబరులో ప్రముఖ సంస్థలు నియామక ప్రక్రియ నిర్వహించనున్నాయి. – వీవీ నాగేశ్వరరావు, ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్, టెక్కలి

టెక్కలి, న్యూస్‌టుడే

కొలువులకు పోటీ పెరిగిన నేపథ్యంలో ఉద్యోగ ఎంపికలు మరింత కఠినమయ్యాయి. విద్యార్థుల నుంచి ఎక్కువ నైపుణ్యాన్ని నియామక సంస్థలు ఆశిస్తున్నాయి. అందుకు తగినట్లు విద్యార్థులు సిద్ధమవలేకపోతున్నారని శిక్షకులు చెబుతున్నారు. ఇటీవల జిల్లాకు చెందిన ప్రముఖ కళాశాలకు చెందిన ప్రతినిధి బృందం సాఫ్ట్‌వేర్ రంగంలో దిగ్గజ సంస్థ ఇండియా హెడ్‌ను సంప్రదిస్తే విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించాలని.. వాటిని పరిశీలించాకే వస్తామని స్పష్టం చేశారు. సైబర్ సెక్యూరిటీ, డేటా సైన్స్‌పై అవగాహన పెంచుకోవాలని సూచించినట్లు సమాచారం. మరికొన్ని సంస్థలు కోడింగ్‌లో పూర్తి స్థాయి నైపుణ్యాలు ఆశిస్తున్నాయి. యాప్స్ తయారు చేయడం, కాన్ఫరెన్స్ పేపర్లు తీర్చిదిద్దడం, వెబ్‌సైట్ హ్యాక్‌థాన్స్‌లో పాల్గొనడం వంటి నైపుణ్యాలను సంస్థలు ఆశిస్తున్నాయి. వృత్యంతర శిక్షణతో పాటు సర్టిఫికెట్ కోర్సులు చేయడం, బృందంలో పని చేసే నైపుణ్యాలు పెంచుకోవడం, సానుకూల దృక్పథం ఉన్న విద్యార్థులను పరిగణలోకి తీసుకోవడం వంటివి చూస్తున్నారు. ఆంగ్ల భాషా నైపుణ్యంతో పాటు ఈ-మెయిల్ రైటింగ్‌కు అధిక ప్రాధాన్యం ఇస్తున్నాయని శిక్షకులు చెబుతున్నారు.

● సివిల్, మెకానికల్, ఈఈఈ, ఈసీఈ విద్యార్థులకు సంబంధిత రంగాల్లో అవకాశాలు మెరుగవుతున్నాయని నిపుణులు చెబుతున్నారు. ఉత్తర భారతదేశంలో పని చేయడానికి సిద్ధపడాలని.. ప్రారంభంలో వేతనంపై కాకుండా అవకాశంపై దృష్టి సారించాలని సూచిస్తున్నారు. కోర్ ఉద్యోగాల్లో క్షేత్రస్థాయి పనిపై అవగాహన పెంచుకుంటే మంచి భవిష్యత్తు సొంతమవుతుందని విద్యార్థులకు తెలియజేస్తున్నారు.

● జిల్లాలోని ఇంజినీరింగ్ కళాశాలల్లో ఉద్యోగ నియామకాలకు నవంబరు నుంచి ప్రముఖ సంస్థలు సిద్ధమవుతున్నట్లు తెలిసింది. విద్యార్థుల్లో నైపుణ్యాలకే ఎక్కువ ప్రాధాన్యం ఉంటుందని.. అందుకు తగినట్లు విద్యార్థులు సిద్ధమవ్వాలని చెబుతున్నారు.

స్వయం కృషితోనే సాధ్యం

ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉన్న కోర్సులు నేర్చుకోవాలి. భాషానైపుణ్యం పెంచుకోవాలి. ప్రస్తుతం పరిస్థితులను అధిగమించేందుకు విద్యార్థి స్వయంకృషితోనే సాధ్యపడుతుంది.
– బి.రాజేష్, జేఎన్‌టీయూ విజయనగరం పాలకమండలి సభ్యుడు

పరిస్థితులను అవగతం చేసుకుంటే మేలు..

విద్యార్థులు వృత్యంతర శిక్షణ స్థాయిలోనే పరిస్థితులు అవగతం చేసుకోవాలి. వేతనం కన్నా ఉద్యోగావకాశం పైనే దృష్టి సారించాలి. కోర్ ఉద్యోగాల వైపు ఆసక్తి పెంచుకోవాలి. ప్రారంభ వేతనాలు తక్కువగా ఉన్నా ప్రముఖ సంస్థల్లో వచ్చే కోర్ అవకాశాలకు విద్యార్థులు సిద్ధమవ్వాలి. తల్లిదండ్రులు సైతం దృక్పథం మార్చుకోవాలి.
– విద్యాసాగర్, శిక్షణ విభాగం హెడ్, బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం

ఇళ్ల మధ్య మురుగు



ఇచ్ఛాపురం గ్రామీణం మండలం పరిధి మశాఖపురం కాలనీలో ఇళ్ల మధ్య మురుగు నిలువడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్లపై నీరు నిల్వ ఉండి మురుగుగా మారింది. వారాలు గడుస్తున్న అధికారులు ఎటువంటి చర్యలు చేపట్టకపోవడంతో వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టి సమస్య పరిష్కరిస్తారని కోరుతున్నారు. ఈ విషయమై ఎంపీడీవో కె.రామారావుకు వివరణ కోరగా పరిశీలించి సమస్య పరిష్కరిస్తామన్నారు. – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం గ్రామీణం

అడుగుకో గుంత

వజ్రపుకొత్తూరు మండలం పూండిబస్టాండ్ నుంచి గోవిందపురం ఉన్నత పాఠశాల వరకు ఉన్న ఆర్ అండ్ బీ రహదారి అడుగడుగునా గుంతలతో అధ్వానంగా మారింది. రైల్వే పాత గేటు వద్ద, పువ్వులేటి కూడలి, ఉన్నత పాఠశాల వద్ద రోడ్డు పూర్తి ఛిద్రమై వాహన ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. పూండి నుంచి పీఎంపురం, రెయ్యిపాడు మీదుగా మందిలిక్కుపేట వరకు ఉన్న మార్గం పూర్తిగా పాడైంది. ఆయా రహదారులను తక్షణమే బాగుచేయాలని ప్రయాణికులు కోరుతున్నారు. ఈవిషయమై శాఖ జేఈ జగదీష్ వివరణ కోరగా.. పూండి-మందిలిక్కుపేట రోడ్డు ప్రత్యేక నిధుల కింద రూ.90 లక్షల మంజూరయ్యాయని, త్వరలో పనులు ప్రారంభించి రోడ్డును అభివృద్ధి చేస్తామని చెప్పారు. – న్యూస్‌టుడే, వజ్రపుకొత్తూరు గ్రామీణం



చివరికి చేరని నీటిచుక్క..!

● కాలువల్లో తగ్గిన వంశధార ప్రవాహ సామర్థ్యం
● శివారు భూముల రైతుల్లో ఆందోళన

పొట్ట దశ, గింజ పాలుపోసుకునే దశకు చేరిన వరి పంటకు సాగునీరు అందకపోవడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. వైకాపా పాలనలో వంశధార నీటి కోసం ఎన్నో కష్టాలు ఎదుర్కొని సాగు చేసినా దిగుబడులు సక్రమంగా రాక నష్టపోయారు. కూటమి ప్రభుత్వం ఏర్పడగానే పలాస వంశధార సబ్‌డివిజన్ పరిధిలో అనుకున్న సమయానికి నీరు రావడంతో రైతులు సంతోషించారు. ముందుగానే నాట్లు వేయడంతో ప్రస్తుతం పంట పొట్ట దశకు చేరుకుంది.కీలక సమయంలో నీరందక కాలువల చుట్టూ తిరుగుతూ అవస్థలు పడుతున్నారు.



60ఆర్‌ఎల్ కాలువలో తగ్గిపోయిన వంశధార నీరు

వజ్రపుకొత్తూరు గ్రామీణం, పలాస, న్యూస్‌టుడే

వంశధార ప్రధాన ఎడమ కాలువ ద్వారా 1,800 క్యూసెక్కుల సామర్థ్యంతో నీరు రావాలి. ప్రస్తుతం 1,200 క్యూసెక్కుల లోపు వస్తుండటంతో శివారు ప్రాంతాలకు చేరడం లేదు. ఒక్కసారిగా నీటి సామర్థ్యం తగ్గిపోయింది. ఎగువ ప్రాంతంలో కొందరు కాలువల మధ్య అడ్డుకట్ట వేసి పొలాలను తడుపుకోవడంతో సమస్య మరింత తీవ్రమైంది. ఈ పరిస్థితితో వజ్రపుకొత్తూరు, పలాస, నందిగాం మండలాల్లోని శివారు ప్రాంతాల రైతులు చివరి దశలో పంట చేజారిపోతుందేమోననే భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.


పొలం తడిపేందుకు రైతుల అవస్థలు

పంటకు కీలక సమయం



రెండున్నర ఎకరాల్లో వరి సాగు చేస్తున్నా. పంటకు ఇది కీలకమైన సమయం. మొదట్లో అనుకున్నంత స్థాయిలో నీరు రావడంతో శివారు ప్రాంతానికి చేరింది. ప్రస్తుతం పంట పొట్ట దశలో ఉంది. ఇప్పుడు నీరందించకుంటే చేతికందడం కష్టమవుతుంది. అన్నీ తాలు గింజలుగా మారుతాయి. అధికారులు మా ప్రాంతానికి పూర్తిస్థాయిలో నీరు చేరేలా చర్యలు తీసుకోవాలి. – హనుమంతు అప్పలస్వామి, రైతు, సీతాపురం

పొలం తడవకుంటే కష్టమే..



ఆరు ఎకరాల్లో వరి సాగు చేస్తున్నా. ఈ ఏడాది వర్షాలు అనుకున్న స్థాయిలో లేవు. గత ఐదేళ్లు వంశధార నీరు శివారు ప్రాంతానికి చేరక ఎంతో నష్టపోయాం. ఈ ఏడాది కూటమి ప్రభుత్వ నాయకుల కృషితో నీరు చేరింది. ఇప్పుడు చాలా కీలకమైన దశ. ఇప్పుడు పొలం తడవకుంటే పంట చేజారిపోతుంది. రైతులు నష్టపోకుండా శివారు ప్రాంతాలకు నీరు అందేలా చర్యలు తీసుకుని ఆదుకోవాలి. – తమ్మినాన బాలకృష్ణ, రైతు, పెద్దబొడ్డపాడు


పీవీపురం వద్ద పొట్ట దశలో వరి పంట

ఇదీ పరిస్థితి

● పలాస సబ్‌డివిజన్ వంశధార కెనాల్ పరిధి నందిగాం, వజ్రపుకొత్తూరు, పలాస మండలాల రైతులు 22 వేల ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. ఈ ఏడాది పూర్తిస్థాయిలో నాట్లు వేశారు. శివారు ప్రాంతాలైన యూకే పురం, నారాయణపురం, బెండి, సీతాపురం, పెద్దబొడ్డపాడు, నగరంపల్లి, కిడిసింగి, తాడివాడ, పలాస మండలం చినబడాం, పెసరపాడు, అంతరకుడ్డ తదితర ప్రాంతాలకు చివరి దశలో పూర్తిస్థాయిలో నీరు చేరాల్సి ఉంది.

● నందిగాం మండలం కణితివూరు, పీవీపురం, మర్లపాడు, హరిదాసుపురం, నారాయణపురం ప్రాంతాలకు అరకొరగానే వస్తుండటంతో నీటి సామర్థ్యం పెంచి నీరందించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

● వజ్రపుకొత్తూరు మండలంలోని 60ఆర్‌ఎల్ కాలువ పాతటెక్కలి, ఎస్‌జే పురం, దేవునల్తాడ మీదుగా సంతబొమ్మాళి మండలం మర్రిపాడు వరకు ఉంది. అటువైపు పూర్తిగా నీటి సామర్థ్యం తగ్గిపోవడంతో ఆయా ప్రాంత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నాలుగైదు రోజుల్లో అందేలా చర్యలు..

హిరమండలం రిజర్వాయర్‌లో నీటి సామర్థ్యం తగ్గడంతో కొంత సమస్య తలెత్తింది. పలాస ప్రాంతానికి చివరి దశలో నీరు చేరాలనే ఉద్దేశంతో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. 2,400 క్యూసెక్కుల సామర్థ్యం కలిగిన ప్రధాన కాలువల ద్వారా కనీసం 1,800 క్యూసెక్కులు నీటి సామర్థ్యం ఉంటే పలాస వరకు నీరు సమృద్ధిగా అందుతుంది. ప్రస్తుతం ప్రధాన కాలువలో 1,200 క్యూసెక్కుల సామర్థ్యం ఉండటంతో శివారు ప్రాంతానికి నీరు పారడం కష్టంగా మారింది. కుడి ప్రధాన కాలువ వైపు నీటి సామర్థ్యం తగ్గించి ఎడమ ప్రధాన కాలువ వైపు పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నాం. నాలుగైదు రోజుల్లో శివారు ప్రాంతాలకు నీరు అందేలా చర్యలు వేగవంతం చేస్తాం.
– టి.రాజశేఖర్, ఏఈఈ, వంశధార శాఖ, పలాస సబ్‌డివిజన్

కొండపై తవ్వకాల రద్దుకు డిమాండు

కలెక్టరేట్ ప్రాంగణం, న్యూస్‌టుడే: బడిదేవర కొండపై గ్రానైట్ లీజు అనుమతులు రద్దు చేసే వరకు పోరాటం చేస్తామని జిల్లా రైతు సంఘ అధ్యక్షుడు ఎం.కృష్ణమూర్తి అన్నారు. ఆదివారం పార్వతీపురంలో వామపక్ష నాయకులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. స్థానికులు ఆరాధ్య దైవంగా భావించే బడిదేవర కొండపై తవ్వకాలకు ఎలా అనుమతులు ఇస్తారన్నారు. 2017లో అటవీ పరిధిలో ఉన్న కొండ 2024లో రెవెన్యూ పరిధిలోని ఎలా మారిందన్నారు. రైతు సంఘ ఉపాధ్యక్షుడు బి.దాసు, జనసేన, సీపీఐ, రైతుకూలీ, గిరిజన సంఘాల నాయకులు పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న అఖిలపక్ష నాయకులు